# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆత్మనిర్భర్ భారత్‌కు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు అతి పెద్ద ఊతంగా నిలుస్తాయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- ❖ రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.
- ❖ చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 13 వేల కోట్ల రూపాయలను బడ్జెట్ లో కేటాయించిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.

==========================

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ను సంతోష, సౌభాగ్య రాష్ట్రంగా కూడా తీర్చిదిద్దుతామని చెప్పారు. విశాఖపట్నంలో ఈ రోజు `స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్` కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ చేసిన ప్రసంగాన్ని దృశ్య మాధ్యమం ద్వారా ఆయన వీక్షించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... ప్రజారోగ్యం విషయంలో సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఆత్మనిర్భర్ భారత్‌కు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు అతి పెద్ద ఊతంగా నిలుస్తాయని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దీని వల్ల దేశంలో ప్రజలకు 2 లక్షల కోట్ల రూపాయల మేర ఆదా అవుతుందని

తెలిపారు. జీఎస్టీ సంస్కరణలపై విశాఖపట్నంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. జీఎస్టీ నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించామని, 12 శాతం పరిధిలో ఉన్న దాదాపు వస్తువులన్నింటినీ 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చామని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. రేపు ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు, 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం ఈ రోజు నిర్వహించా రు. ఈ సమీక్షలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. రేపటి ఉభయసభలు ప్రశ్నోత్తరాలతో ప్రారంభమవుతాయి. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశం జరుగుతుంది. శాసన సభ సమావేశాల నిర్వహణపై తుది నిర్ణయం బీఏసీ సమావేశంలో తీసుకోనున్నారు.

==========================

చేతి వృత్తులకు ప్రభుత్వం 13 వేల కోట్ల రూపాయలను బడ్జెట్ లో కేటాయించడం జరిగిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఈ రోజు జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలు సందర్భంగా ఆయన విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశంలో 18 రకాల చేతివృత్తులను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం జరిగిందన్నారు. "పీఎం విశ్వకర్మ యోజన" పేరిట చేతి వృత్తిదారులకు శిక్షణను అందించి కిట్స్ తో పాటు, రోజుకు 500 రూపాయలు చొప్పున స్టైఫండ్ కూడా అందజేయడం జరుగుతోందన్నారు.

విరామం

==========================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రస్తానంపై పలు రంగాలకు చెందిన ప్రముఖుల స్పందనను ఇప్పుడు తెలుసుకుందాం.

(వాయిస్ 90 సెకన్లు)

==========================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద ముంబై జాతీయ రహదారిపై ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఇసుక టిప్పర్ కారును బలంగా ఢీ కొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

==========================

బీసీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ పొందిన 246 మంది మెగా డీఎస్సీలో ఎంపిక కావడం హర్షనీయమని రాష్ట్ర వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆమె ఈ రోజు మాట్లాడుతూ... కార్పొరేట్ సంస్థలకు దీటుగా బీసీ స్టడీ సర్కిల్స్ లో నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నామని చెప్పారు. ఫలితంగా స్కోచ్ అవార్డును కూడా కైవసం చేసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని బీసీ యువత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలనే మెగా డిఎస్సీకి 6,470 మందికి ఆఫ్ లైన్, ఆన్ లైన్ మాధ్యమంలో శిక్షణ అందించామని మంత్రి తెలిపారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==========================

రాష్ట్రంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని, దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాయలసీమలో ఒకటి రెండు చోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రేపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని తెలియజేశారు.

==========================
==========================